'కోదాడలో వంద పడకల దవాఖాన నిర్మించాలి'


నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు బెజవాడ శ్రవణ్, కౌన్సిలర్ శిరీష, నాయకులు

కోదాడ, డిసెంబర్ 12: గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోదాడలో వంద పడకల దవాఖాన నిర్మాణానికి రూ.29 కోట్లు మంజూరు చేసిందని, అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తామే నిధులు మంజూరు చేసినట్టు చెప్పుకుంటుందని, ముగ్గురు మంత్రులు ఆర్భాటంగా దవాఖాన నిర్మాణానికి శిలాఫలకం వేసి ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు బెజవాడ శ్రవణ్, కౌన్సిలర్ శిరీష అన్నారు. ఈ మేరకు గురువారం కార్యకర్తలతో కలిసి శిలాఫలకం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. పరిసర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది నిరుపేదలు కోదాడ దవాఖానకు వస్తుంటారని, అయితే 16 మంది వైద్యులు విధులు నిర్వహించాల్సి ఉండగా ముగ్గురే సేవలందించడం శోచనీయ మన్నారు. ప్రసూతి వైద్యురాలు లేక నిరుపేద మహిళలు వేల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ దవాఖానలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. నిరసనలో కుడుముల రవికుమార్, శిరీష, శ్రీను, ప్రతిమ, మరియమ్మ, వేణు, ఉపేందర్, తరుణ్, నాని, బోస్, బాబు, సతీశ్ పాల్గొన్నారు.

అనుమతులు లేని ధాన్యం లారీల గుర్తింపు

● ఆంధ్రాకు తిప్పి పంపిన పోలీసులు

మేళ్లచెర్వు, డిసెంబర్ 12: ధాన్యం లోడుతో ఉన్న మూడు లారీలు ఆంధ్రప్రదేశ్ నుంచి రామాపురం సరిహద్దు మీదుగా గురువారం మండలంలోకి అక్రమంగా ప్రవేశించాయి. లారీలను చెక్‌పోస్టు వద్ద ఆపకుండా వెళ్లడంతో అక్కడి సిబ్బంది స్థానిక తాసీల్దార్‌కు తెలియజేశారు. దీంతో ఎస్ఐ పరమేశ్‌కు తాసీల్దార్ సమాచారం ఇవ్వడంతో లారీలను అడ్డుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా వచ్చిన ఆ లారీలను తిరిగి ఆంధ్రా సరిహద్దు దాటించినట్లు ఎస్ఐ పరమేశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏపీ మహిళ దుర్మరణం

చివ్వెంల, డిసెంబర్ 12: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని వల్లభాపురం శివారులో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ కథనం ప్రకారం.. ఏపీలోని కృష్ణా జిల్లా కొండలపాలెం గ్రామానికి చెందిన మెరికనపల్లి ఇందిర (45) హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకని ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. ఈ క్రమంలో మండలంలోని వల్లభాపురం శివారులో సాయికృష్ణ హోటల్ సమీపంలోని ఛార్జింగ్ పాయింట్ వద్ద డ్రైవర్ బస్సు ఆపాడు. కిందికి దిగిన ఇందిర మూత్ర విసర్జన కోసమని రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుండగా, హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలై అక్కడిక్కడే మృతిచెందింది. మృతురాలి అల్లుడు గడ్డం రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు.

దమ్ము చక్రాలతో రోడ్లపైకి వస్తే చర్యలు

● ఎస్ఐ నరేశ్

గరిడేపల్లి, డిసెంబర్ 12: దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపైకి వస్తే చర్యలు తప్పవని ఎస్ఐ చలికంటి నరేశ్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని కల్మల్‌చెరువు రోడ్డుపై దమ్ము చక్రాలతో వస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. ట్రాక్టర్లకు దమ్ము చక్రాలు తగిలించుకొని వెళ్తుండడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 12: రాష్ట్రంలోని గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి మాట్లాడారు. గురుకులాలకు పక్కా భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఎస్సీ గురుకులంలో వాటర్ ట్యాంక్ లేకపోవడంతో నేరుగా మోటార్ సాయంతో విద్యార్థులు నీటిని వాడుకుంటున్నారని, పాఠశాల సమయానికి స్నానాలు చేయలేని పరిస్థితి ఉందన్నారు. సరిపడా తరగతి గదులు లేవని, విద్యార్థులకు బెంచీలు లేక కింద కూర్చొని పాఠాలు వింటున్నారని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బానోతు వినోద్‌కుమార్, నాయకులు శ్రీనునాయక్, వినయ్, శ్రవణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి

● త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్ కుమార్ దేవ్‌కు వినతి

కోదాడ, డిసెంబర్ 12: దేశవ్యాప్తంగా రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఓ శుభకార్యానికి గురువారం కోదాడకు వచ్చిన త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బిప్లవ్ కుమార్ దేవ్‌కు తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా డీజిల్, పెట్రోల్ ధరలు, టోల్‌గేట్ రుసుంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మం, కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, పత్తిపాక జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మందులతో క్షయ వ్యాధిని తగ్గించొచ్చు

● హెల్త్ సూపర్‌వైజర్ సైదులు

క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పెన్‌పహాడ్, డిసెంబర్ 12: మండలంలోని అనాజిపురం గ్రామంలో గురువారం క్షయ వ్యాధి పరీక్షల క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ భూతరాజు సైదులు మాట్లాడుతూ.. క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి తుంపర్ల ద్వారా సంక్రమిస్తుందని తెలిపారు. రెండు వారాలుగా ఎడతెరిపి లేని దగ్గు, తెమడ, రక్తంతో కూడిన తెమడ, ఛాతి నొప్పి, సాయంత్రం పూట జ్వరం రావడం, రాత్రి నిద్రలో చెమట పట్టడం క్షయ వ్యాధి లక్షణాలని తెలిపారు. మందులు క్రమం తప్పకుండా వాడితే క్షయ వ్యాధి తొందరగా నయమవుతుందని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌సీ డాక్టర్ అనూష, ల్యాబ్ టెక్నీషియన్ లింగాల రాజు, హెల్త్ అసిస్టెంట్ రమేశ్, ధనమ్మ, సైదమ్మ, గోవర్ధనమ్మ, జి.సైదమ్మ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME

I, NALLAGANTI SHIVAIAH alias NALLAGANTI SHIVAN (Old Name), S/o. Nallaganti Ramulu, R/o. H.No.4-41, Thripuraram (Vi) & (Mdl.), Nalgonda (Dist) I have changed my Name (New Name) NALLAGANTI SHIVAN, S/o. Nallaganti Ramulu.

WANTED

★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499. NT-338978-All

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం

మరిన్ని వివరాలకు: నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | దామరచర్ల: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | తొలుపునూరి: 9182777638

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

● జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలో కలెక్టర్ హనుమంతరావు

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో ఎగ్జిబిట్స్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు, అధికారులు

భువనగిరికలెక్టరేట్, డిసెంబర్ 12 : ఉపాధ్యాయులు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను బావి శాస్త్రవేత్తలుగా ప్రోత్సహించి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పట్టణ పరిధిలోని రాయగిరి విద్యా జ్యోతి ఉన్నత పాఠశాలలో గురువారం విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డు ప్రదర్శన-2023-24 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పిల్లలను ప్రోత్సహించడం, వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడం మన అందరి కర్తవ్యవమని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు సృజనాత్మకత నైపుణ్యాన్ని పెంపొందించుకొని, వినూత్న ఆలోచనలతో జీవితానికి పునాదులు వేసుకోవాలని చెప్పారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకొని అభినందించారు. సైన్స్ ఫెయిర్‌లో మొత్తం 95 ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు, 190 బాల వైజ్ఞానిక ప్రాజెక్టులు ప్రదర్శించారు. కార్యక్రమంలో డీఈఓ సత్యనారాయణ, సహాయ సంచాలకులు ప్రశాంత్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైకిల్ చక్రంతో వృత్తపరిధిని కనుక్కోవడం..

సైకిల్ చక్రంతో వృత్తపరిధిని కనుక్కోవడం ఎలాగో తెలియజేసేందుకు పట్టణంలోని సాధన హైస్కూల్‌కు చెందిన విద్యార్థి అందె ప్రశాంత్ రూపొందించిన ప్రదర్శన చక్కటి సందేశంతో పాటు పలువురిని ఆకట్టుకుంది.

యంత్ర సాయంతో ఇటుకల లెక్కింపు

ఇటుక బట్టీల వద్ద ఇటుకలను యంత్ర సాయంతో లెక్కించేందుకు వీలుగా పట్టణంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎం.వినోద్, ఎస్.లక్ష్మీనారాయణ, గైడ్ టీచర్ సంధ్య తో కలిసి చేసిన ప్రదర్శన కూడా ఆకట్టుకుంటుంది. బట్టీల్లో కార్మికుల ఖర్చును ఈ లెక్కింపు యంత్రంతో తగ్గించుకోవచ్చని విద్యార్థులు తెలిపారు.

మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని ఆందోళన

తుంగతుర్తి, డిసెంబర్ 12: మండల కేంద్రంలోని వెంపటి రోడ్డులో గల డ్రైనేజీలో మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రోగాల పాలవుతున్నామని స్థానికులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పనులు, మురుగు కాల్వల నిర్మాణం, మరమ్మతుల గురించి కూతవేటు దూరంలో ఉన్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని వాపోయారు. మురికి కాల్వల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, నివాసం ఉండలేకపోతున్నామని, కనీసం అన్నం తినే పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచి తమ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వెంపటి రోడ్డులో ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

15న జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 12: కబడ్డీ జిల్లా జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికను ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా అడ్‌హక్ కమిటీ చైర్మన్ ఆర్.భూలోకరావు, కన్వీనర్ రత్తయ్య తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీల లోపు బరువు కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికైన వారు త్వరలో జనగామ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహ్మద్ జాని, అల్లం ప్రభాకర్‌రెడ్డి, రామసాని రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

● జిల్లా క్రీడల విభాగం అధికారి రామ్‌చందర్‌రావు

క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జిల్లా క్రీడల అధికారి రామ్‌చందర్‌రావు

చిలుకూరు, డిసెంబర్ 12: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా క్రీడల విభాగం అధికారి, మండల ప్రత్యేకాధికారి రామ్‌చందర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రం చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో సీఎం కప్ ఆటల పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, పీడీలు సీతారాంరెడ్డి, బ్రహ్మారెడ్డి, రేణుక, ప్రకాశ్, రాము, శోభన్‌బాబు, మట్టయ్య, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయుడికి సన్మానం

శ్రీనివాసచారిని సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

చింతలపాలెం, డిసెంబర్ 12: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు బొల్లవరపు శ్రీనివాసచారి సూర్యాపేట జిల్లా ఉత్తమ గణిత ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భంగా ఎంఈఓ నారపరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. శ్రీనివాస రామానుజన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఉత్తమ గణిత ఉపాధ్యాయుడిగా శ్రీనివాసచారి ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవరశెట్టి నారాయణరావు, షేక్ ఉస్మాన్, శ్రీనివాస్, సురేశ్, పద్మావతి, నిర్మల కుమారి, ఫాతిమా, జ్యోతి, విజయ, సరిత తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయం

తుంగతుర్తి, డిసెంబర్ 12: మండల కేంద్రంలోని తూర్పుబజారులో గల మహాదేవర రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం శివస్వాముల ఇరుముడి వైభవంగా నిర్వహించారు. గురుస్వామి ఎర్ర హరికిషన్ కర్దమ ఆధ్వర్యంలో ఇరుముడి కట్టారు. అంతకుముందు ఆలయంలో గణపతి హోమం, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయం శివనామస్మరణతో మార్మోగింది.

ఆర్థిక సాయం

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 12 : మండలంలోని వంకమామిడి గ్రామానికి చెందిన గరిసె లింగస్వామి ఇటీవల మృతి చెందాడు. డ్రైవర్ యూనియన్ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. కార్యక్రమంలో డ్రైవర్ యూనియన్ నూతన అధ్యక్షుడు గోరుగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చుక్క రమేశ్, బొడిగె హరీశ్, ప్రధాన కార్యదర్శి ఇరుకు తిరుమలేశ్, నాయకులు ఎల్దండి మల్లేశ్, గాలి విష్ణు, చెక్క శ్రీకాంత్, బొడిగె నరసింహ, పాలెం ప్రసాద్, ఉడుతల శ్రీకాంత్, బాతరాజు వంశీ, యూనియన్ సభ్యులు ఉన్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

లింగస్వామి (ఫైల్)

రామన్నపేట, డిసెంబర్12 : కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సర్నేని గూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం... సర్నేని గూడెం గ్రామానికి చెందిన బర్మ సత్తయ్యకు ముగ్గురు సంతానం. చిన్నకుమారుడైన లింగస్వామి (24) చౌటుప్పల్ మండలంలోని ఎస్‌లింగోటంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడు కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ఓప్రైవేటు దవాఖానలో సంవత్సరం క్రితం చికిత్స చేయించినా కడుపు నొప్పి తగ్గలేదని బాధపడే వాడు. బుధవారం కడుపునొప్పి తీవ్రం అవడంతో నొప్పి భరించలేక తన వ్యవసాయ బావి వద్ద గడ్డి మందును తాగి తన తండ్రి సత్యనారాయణకు ఫోన్ చేసి తెలిపాడు. దీంతో కుటుంబసభ్యులు అతన్ని హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. గురువారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు మధు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.

'గోశాలను పరిరక్షిస్తాం'

ఆలేరు టౌన్, డిసెంబర్ 12 : ఆలేరు పట్టణం బహదూర్‌పేటలోని శ్రీసారబుడ్ల సావిత్రమ్మ లక్ష్మారెడ్డి గోశాలపై కిరాయి గూండాల దాడి చేయడాన్ని దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, హిందూ జేఏసీ జాతీయ అధ్యక్షులు కట్టెగొమ్ముల రవీందర్‌రెడ్డి ఖండించారు. ధ్వంసం చేసిన గోశాలను పలువురు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. గోశాలపై దాడి చేసిన నిందితులను వదిలేసి ఫిర్యాదు చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయడం తగదని తెలిపారు. ప్రస్తుతం గోశాలకు మద్దతుగా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. నాయకులు ప్యారపు శివకృష్ణ, కుండె గణేశ్, దయ్యాల సంపత్, భాస్కర్, రాయపురం శ్రీనివాస్, పాశికంటి సంపత్, పేరపు ఆనంద్, రమేశ్, బీరప్ప, సతీశ్ పాల్గొన్నారు.

చలిమంటతో ఉపశమనం

చలిమంట కాచుకుంటున్న ఆటో డ్రైవర్లు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్12 : చలి తీవ్రత ఎక్కువ కావడంతో చిన్నా, పెద్ద తేడా గజగజ వణుకుతున్నారు. ఉదయం పనులకు వెళ్లే వారు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి నుంచి రక్షించుకునేందుకు ఆత్మకూర్ మండల కేంద్రంలో గురువారం ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు చలిమంటలు వేసి కాచుకున్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడి పూజ

పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 12 : పట్టణంలోని కిసాన్‌నగర్‌లో మాజీ ఎంపీటీసీ మచ్చ మాలతి నర్సింహాగౌడ్ స్వగృహంలో గురువారం హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీపీ రాసాల నిర్మలవెంకటస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొత్నాక్ ప్రమోద్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహాంగీర్, నాయకులు కైరంకొండ వెంకటేశ్, పాశం శివానంద్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, చల్లగురుగుల రఘుబాబు, మాలధారులు పాల్గొన్నారు.

జనజాతర మహాసభను జయప్రదం చేయాలి

రామన్నపేట : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లెల పెంటయ్య

రామన్నపేట, డిసెంబర్12 : ఈ నెల15, 16, 17 తేదీల్లో చౌటుప్పల్‌లో నిర్వహించే సీపీఎం యాదాద్రి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జిల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన మండల కమిటీ సమావేశంలో మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్గూరి అంజయ్య, కల్లూరి నగేశ్, బాలరాజు, ఉపేందర్, వేముల సైదులు, గొరిగె సోములు, రఫీద్, పులి భిక్షం, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : ఈ నెల 15న చౌటుప్పల్‌లో జరిగే జన జాతర బహిరంగ సభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి కోరారు. పట్టణ కేంద్రంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రచార వాహనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మంచాల మధు, నాయకులు సిలువేరు లాలయ్య, లక్ష్మయ్య, యాదగిరి, కృష్ణ, సోమయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

టేకులసోమారంలో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి జగన్నాథరావు

వలిగొండ, డిసెంబర్12 : ఇండ్లు లేని నిరుపేదల ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించడానికి గ్రామాల్లో చేపట్టిన సర్వే పనులను టేకులసోమారం, ముద్దాపురంలో గురువారం మండల ప్రత్యేక అధికారి జగన్నాథ రావు, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఇంటి స్థలం పత్రాలతోపాటు, రేషన్ కార్డు, ఆధార్ కార్డును సర్వే అధికారులకు అందజేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో దరఖాస్తు దారులు నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ సర్వేపనులు వేగంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కేదారేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లను ఎస్ఐ కొట్టాడని పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా

పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు

భూదాన్ పోచంపల్లి ,డిసెంబర్ 12 : మైనర్ యువకులను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి ఎస్సై చితక బాదారని ఆరోపిస్తూ పిల్లల తల్లిదండ్రులు గురువారం భూదాన్ పోచంపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. మండలంలోని ఇంద్రియల గ్రామంలో బుధవారం సాయంత్రం పిల్లలు గొడవ పడుతున్నారని పోలీసులు గురువారం ఇంటి నుంచి నక్క బన్నీ, నక్క సిద్దు, మొగిలి పాక అక్షయ్, మొగిలిపాక చరణ్, జింక సాయి చరణ్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు ఉదయం తీసుకొస్తే ఎస్ఐ లేకపోవడంతో సాయంత్రం వరకు స్టేషన్‌లో కూర్చోబెట్టారని, సాయంత్రం స్టేషన్‌కు వచ్చిన ఎస్ఐ కంచర్ల భాస్కర్ రెడ్డి మైనర్ పిల్లలందరినీ తమ ఎదుటే చితక బాదారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను ఎందుకు కొడుతున్నారని అడిగితే స్టేషన్ బయటికి గెంటేశారని తెలిపారు. పిల్లలు చేసిన తప్పేంటి అని విచారణ చేయకుండా కొట్టడమేంటని ప్రశ్నించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. ఈ విషయంపై ఎస్ఐ మాట్లాడుతూ పిల్లలను బెదిరించానే తప్ప తాను కొట్టలేదని తెలిపారు. ఈకార్యక్రమంలో బాధితుల తల్లిదండ్రులు మొగిలిపాక పరమేశ్, సురేశ్, నక